క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో రేణుకా ఎల్లమ్మ బోనాలకు శనివారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



అనుశ్రీ



మేఘన

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నూకల అనుశ్రీ(చిన్నముల్కనూర్), మేఘన(ముదిమానిక్యం) ఏటా రూ.12 వేల ఉపకార వేతనాన్ని నాలుగేళ్లపాటు అందుకుంటారని ఆయన పేర్కొన్నారు.

2న జమ్మికుంట మండల సర్వసభ్య సమావేశం

జమ్మికుంట: జమ్మికుంట మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమత అధ్యక్షతన వచ్చే నెల 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భీమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు ఇది చివరి సమావేశమని, వీడ్కోలు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని సూచించారు.

సాయిబాబాకు పల్లకి సేవ



చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం గణపతి, దత్తాత్రేయ స్వాములకు, సాయిబాబాకు అభిషేకం, అన్న ప్రసాద వితరణ, భజన చేపట్టారు. సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి, దండె లింగయ్య, దూస రాము, తదితరులున్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు

చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు జగన్ మోహన్‌స్వామి, నవీన్‌కుమార్‌లు అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి సేవ చేపట్టారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుంటి మల్లయ్య, మంద అంజయ్య, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి, పండ్లు అందజేత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి స్పందన అనాథ ఆశ్రమంలో శనివారం న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు నోట్‌బుక్స్, పెన్నులు, కంపాక్స్ బాక్స్, పండ్లు అందజేశారు. తల్లితండ్రులు లేని పిల్లలకు తమవంతుగా సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రసాద్, సంపత్, జాన్, అశోక్ జాన్‌మార్క్, జోతి బాబు, సువార్త రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ప్లేట్లు..

రామడుగు: మండలంలోని వెదిర శ్రీ గురుదత్త దేవాలయంలో ప్రతీ పౌర్ణమికి భక్తులకు అన్నదానం కోసం తూము మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజు శనివారం 20 అందించారు. అలాగే, సువీన్‌యాదవ్, కిషన్, నరేశ్‌లు భోజనం వడ్డించేందుకు అవసరమైన సామగ్రిని పూజారి చంద్రాస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ భూపతిలకు అందజేశారు.

ఎమ్మెల్యే భార్య మృతి బాధాకరం

చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఆకస్మిక మృతి బాధాకరమని టీడీపీ నాయకులు చిల్ల వెంకటేశం, మావురం చంద్రయ్య, బత్తిని లక్ష్మణ్, నెల్లి కనకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఎమ్మెల్యే ఈ విషాదం నుంచి త్వరగా కోలుకొని, తిరిగి ప్రజాసేవలో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు.

ఆరుద్ర పురుగు.. కనువిందు



రామడుగు: మండలంలోని పలు గ్రామాల రైతుల పంట పొలాల్లో ఆరుద్ర పురుగు కనువిందు చేసింది. శనివారం ఆరుద్ర కార్తె ప్రారంభం కావడం, ఆరుద్ర పురుగు కనిపించడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు.

మనోడిదే.. 'లగ్గం'

- సినిమా డైరెక్టర్ రమేశ్ చెప్పాల స్వగ్రామం వీణవంక మండలంలోని కనపర్తి
- ఫస్ట్ సాంగ్ రిలీజ్
- యూట్యూబ్, సోషల్ మీడియాలో ప్రోమో హల్‌చల్
- ఆగస్టు చివరి వారంలో చిత్రం విడుదలకు సన్నాహాలు
- 2007లో శ్రేయోభిలాషి సినిమాకు నంది అవార్డు

సండే స్పెషల్

వీణవంక: 'భీమదేవరపల్లి బ్రాంచ్' సినిమాతో ప్రేక్షకులను అలరించి, మంచి దర్శకుడుగా పేరు తెచ్చుకున్న రమేశ్ చెప్పాల మరో చిత్రానికి శ్రీకారం చుట్టాడు. పెళ్లి అంటే రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు.. రెండు మనసుల కలయిక అని చెప్పే కథాంశంతో 'లగ్గం' సినిమాను తెరకెక్కించాడు. తెలంగాణలో వివాహ సంస్కృతిని కళ్లకు కట్టినట్టు ఈ సినిమాలో చూపిస్తున్న రమేశ్ మనోడే. ఇతని స్వగ్రామం వీణవంక మండలంలోని కనపర్తి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ నెల 21న ప్రముఖ నటుడు సందీప్ కిషన్ చేతులమీదుగా ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ చిత్రంలో కనకవ్వ పాడిన పాట ప్రోమో యూట్యూబ్, సోషల్ మీడియాలో క్రేజ్ తెచ్చింది. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రమేశ్ చెప్పాల, నిర్మాత వేణుగోపాల్‌రెడ్డి, సంగీతం చరణ్ అర్జున్, నటీనటులు సాయిరోనక్, ప్రగ్యానగ్రా, సప్తగిరి, రోహిణి, ఎల్‌బీ.శ్రీరాం, రచ్చ రవి, చిత్రం శ్రీను, చమ్మక్ చంద్ర, వివారెడ్డి నటిస్తుండగా ఇందులో ప్రముఖ హీరో రాజేంద్రప్రసాద్ కీ రోల్ చేస్తున్నారు. ఆగస్టు చివరి వారంలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్న సందర్భంగా రమేశ్ చెప్పాల మాటలతో సండే స్పెషల్ స్టోరీ.



సినిమా పోస్టర్



గవర్నర్ బండారు దత్తాత్రేయ, సినీ హీరో సుమన్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ రమేశ్



లగ్గం సినిమాలో నటీనటులు

విందు భోజనం లాంటిది..

పెళ్లిలో ఉండే సంబరాన్ని, విందు, చిందును కనుల విందుగా లగ్గం సినిమాలో చూపించబోతున్నాం. ఇది కల్చరల్ ఫ్యామిలీ డ్రామా చిత్రమవుతుంది. చూశాక ప్రతిఒక్కరూ దీని గురించే మాట్లాడుకుంటారు. కొత్త తరాలవారు గుర్తుంచుకునే సినిమా అవుతుందని ఆశిస్తున్నాను. ఇందులో ఓ ప్రధాన పాత్రలో రాజేంద్రప్రసాద్ నటించడం ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది. మొత్తం ఆరు పాటలు ఉండగా, ప్రముఖ ఆడియో కంపనీ ఆదిత్య వీటి రైట్స్‌ను ఫ్యాన్సీ రేటుకు సొంతం చేసుకుంది. పాటలు అద్భుతంగా ఉంటాయి. పెళ్లి నేపథ్యంలో సాగే 'లగ లగ లగ్గం' సాంగ్‌ను విడుదల చేశాం. షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రతీ ఆర్టిస్ట్ అద్భుతంగా నటించారు. సుభాషి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించినా.. మా నిర్మాత వేణుగోపాల్‌రెడ్డి అన్నివిధాలా సహకరించడం అదృష్టంగా భావిస్తున్నాను. లగ్గం సినిమా గురించి ఎంతోమంది ఫోన్లు చేస్తున్నారు. టైటిల్ బాగుంది.. తరతరాలకు గుర్తిండిపోయేలా ఉంటుందని చెబుతున్నారు.

త్వరలో పాన్ ఇండియా మూవీ..

'సర్పంచ్' టైటిల్‌తో ఓ పాన్ ఇండియా మూవీకి దర్శకత్వం వహిస్తున్నాను. త్వరలోనే షూటింగ్ మొదలు పెడతాం. భారీ బడ్జెట్‌తో 5 భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నాం. భీమదేవరపల్లి బ్రాంచ్ సినిమా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. దీని టైటిల్‌తోపాటు కథ కూడా డిఫరెంట్‌గా ఉండటంతో ప్రేక్షలకు తొందరగా కనెక్ట్ అయ్యింది. భీమదేవరపల్లి బ్రాంచ్ సినిమాకు ఇటీవల ప్రజా డైరీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బెస్ట్ ఫిల్మ్ డైరెక్టర్ అవార్డు రావడం, దాన్ని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సినీ హీరో సుమన్ చేతులమీదుగా తీసుకోవడం సంతోషంగా ఉంది. 2007లో రాజేంద్రప్రసాద్ నటించిన మీ శ్రీయోభిలాషి సినిమాకు మాటల రచయితగా నంది అవార్డు అందుకోవడం నా జీవితాన్ని మలుపుతిప్పింది. వీణవంక, హుజూరాబాద్‌లలో డిగ్రీ వరకు చదివాను. ఉన్నత చదువులను హైదరాబాద్‌లో పూర్తి చేశాను. చిన్నప్పటి నుంచి కథలు, కవితలు రాయడం ఇష్టం. అదే స్ఫూర్తితో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. ఎంత బిజీగా ఉన్నా మా ఊరును మరిచిపోను. చిన్ననాటి ఆటలు, దోస్తులు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కొత్తవారికి ఎక్కువగా అవకాశాలు ఇచ్చేందుకు కృషి చేస్తా. సర్పంచ్ సినిమా తర్వాత మరో పెద్ద చిత్రం చేసేందుకు ఆలోచిస్తున్నాను. ఇందులో ప్రముఖ హీరోను తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నాను.

'మానేరు'పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి





కేంద్ర మంత్రి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు, సన్మానిస్తున్న చొప్పదండి నాయకులు

గన్నేరువరం: మండలం నుంచి జిల్లా కేంద్రం కరీంనగర్‌కు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి, వినతిపత్రం అందించారు. 50 ఏళ్ల క్రితం ఎల్‌ఎండీ నిర్మాణం చేపట్టడంతో మండలంలోని పదుల సంఖ్యలో గ్రామాలు, వేలాది ఎకరాల సాగు భూములు, ఇళ్లు ముంపునకు గురయ్యాయని తెలిపారు. అంతేకాకుండా అప్పటివరకు కరీంనగర్ వెళ్లడానికి 9 కిలోమీటర్ల దూరం ఉండగా డ్యాం నిర్మాణం అనంతరం 40 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. దూరభారం వల్ల విద్య, వైద్యం, ఇతర అవసరాలకు ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం కోసం పోరాటం చేస్తున్నామని, కేంద్ర మంత్రి హోదాలో మీ సహకారంతో పూర్తవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిడ్జి గన్నేరువరంతోపాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లెల జగన్, పుల్లె రాము, బామండ్ల రవీందర్, సోమిరెడ్డి రఘునాథ్ రెడ్డి, కటకం తిరుపతి, కాంతాల కృష్ణారెడ్డి, కొలుపుల వేణు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి 'బండి'కి సన్మానం

చొప్పదండి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను చొప్పదండి బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్‌కుమార్, నాయకులు చేపూరి సత్యనారాయణ, రాజన్నల రాజు, చిల్ల శ్రావణ్, మంచికట్ల మల్లేశం, మంద శ్రీరాం, తాడూరి రామకృష్ణ, రాజశేఖర్, కుమార్, సురేశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం వద్దు

- జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ అయాజ్



మాట్లాడుతున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని కమిషనర్ మహమ్మద్ అయాజ్ హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీరోజు రూ.3 లక్షల వసూలు టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు, వర్తక, వాణిజ్య వ్యాపారులు సహరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు పుస్తకాల విక్రయంపై ఫిర్యాదు



జమ్మికుంట: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బుక్‌స్టోర్స్‌లో పుస్తకాలను పెట్టించి, కమీషన్ తీసుకుంటూ అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆయా యాజమాన్యాలు, బుక్‌స్టాల్స్‌పై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. నాయకులు కొమ్ము నరేశ్, గోపగాని సుశాంత్, పర్లపల్లి శ్రీనివాస్, గట్టు సాయిరామ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లందకుంట: టేకుర్తి ఆదర్శ పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ(ఇంగ్లిష్), బీఈడీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 26న పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

కాపర్ వైరు చోరీ

జమ్మికుంట: ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రవి వివరాల ప్రకారం.. దుండగులు మడిపల్లి శివారులోని 2 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రూ.30 వేల విలువైన కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. విద్యుత్ శాఖ జమ్మికుంట రూరల్ ఏఈ రమేశ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు క్షీరాభిషేకం





సైదాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, చిగురుమామిడిలో..

సైదాపూర్: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి మంత్రి వర్గం తీర్మానం చేయడంపై కాంగ్రెస్ సైదాపూర్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు కిష్టయ్య, రాఘవులు, రాజిరెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ఎర్రల శ్రీనివాస్, మునుపాల రవి తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేసేందుకు మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రె చిగురుమామిడి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం స్వప్న, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు



మానకొండూర్: పీఈటీలను సన్మానించిన ఎంఈవో మధుసూదనాచారి

చిగురుమామిడి: మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు ఈ నెల 24, 25వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం చిగురుమామిడి విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పైన పేర్కొన్న రెండు రోజుల్లో ఉదయం 9.30 గంటలకు చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలలోని క్రీడా మైదానంలో 4వ తరగతి విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. మొత్తం 7 రకాల శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీ సమ్మయ్య, సూర్యప్రకాశ్, జ్యోతి, కల్పన, రజిత తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశానికి చొప్పదండి మండల విద్యార్థులకు ఈ నెల 25న పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వేణుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతూ, స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు, మూడోతరగతి ప్రోగ్రెస్ కార్డు, మూడు పాసుపోర్ట్ సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు ఫిజికల్ డైరెక్టర్ కృష్ణను సంప్రదించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 27న జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

మానకొండూర్: మండలంలోని పీఈటీలతో ఎంఈవో మధుసూదనాచారి శనివారం మానకొండూర్ ఎమ్మార్సీలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను జరపనున్నట్లు తెలిపారు. బాల బాలికలు 4వ తరగతి చదువుతూ, ఆరోగ్యవంతులై ఉండాలన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా మానకొండూర్ మండలానికి వచ్చిన పీఈటీలు శ్రీనివాస్, వీరన్న, రమ, శ్యామలాదేవి, రమేశ్‌లను ఎంఈవో సన్మానించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నరసయ్య తదితరులున్నారు.

గంగాధర: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 25న గంగాధర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో వేణుకుమార్ పేర్కొన్నారు. మూడో తరగతి పూర్తయి, 1 సెప్టెంబర్ 2015 నుంచి ఆగస్టు 31, 2016 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

గన్నేరువరం: క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 25న గన్నేరువరం మండల స్థాయి ఎంపిక పోటీలను జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో కనీస పాయింట్లు సాధించిన విద్యార్థులను 27న కరీంనగర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలకు జంగపల్లి పాఠశాలలో పీడీ రామును సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి




వెదిర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

గంగాధర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని డీఈవో జనార్దన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. గంగాధర మండలంలోని బూర్గుపల్లి హైస్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీపై ఆరా తీశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి, వారి ప్రతిభను తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు, బోధనా పద్ధతులపై టీచర్లతో చర్చించారు. హెచ్‌ఎం మల్లికార్జున్ తదితరులున్నారు.

వెదిర ఉన్నత పాఠశాలలో..

రామడుగు: మండలంలోని వెదిర జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ, బడిబాట కార్యక్రమ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వసతుల కల్పనపై విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి తదితరులున్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో శనివారం 7 మట్టి టిప్పర్లను పట్టుకున్నట్లు హుజూరాబాద్ ఆర్టీఏ వేణు తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న వీటికి సరైన ధ్రువపత్రాలు లేనందున సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రెండో పెళ్లి చేసుకున్న భర్తపై కేసు

జమ్మికుంట: భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా రెండో పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా, ససూర్ మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన లతకు, జమ్మికుంట మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన కొండు రవీందర్‌కు 2009లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవీందర్ పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పని చేస్తున్నాడు. ఏడాదిగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత జనవరి 20న కరీంనగర్ వెళొస్తానని ఇంట్లో చెప్పి, వెళ్లాడు. తిరిగి రాలేదు. గత ఫిబ్రవరి 18న అతను గంగాధర మండలంలోని అచ్చంపేటకు చెందిన సంగీతను ఎల్‌ఎండీ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పెళ్లి చేసుకున్నాడు. విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న రవీందర్, సంగీతలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

లంబాడిపల్లికి బస్సొచ్చింది..



బస్సును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రవీందర్, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లికి ఎట్టకేలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సును మంజూరు చేయించారు. బస్సును జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. లంబాడిపల్లి నుంచి చిన్నముల్కనూర్‌లోని ఆదర్శ పాఠశాలకు నిత్యం 25 మంది విద్యార్థులు వెళ్తున్నారని తెలిపారు. బస్సు రావడంతో వారు కిలోమీటర్లు చిగురుమామిడికి నడిచే బాధ తప్పిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, మాజీ ఉపసర్పంచ్ ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు సందవేణి సంపత్, పోటు మల్లారెడ్డి, బెజ్జంకి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

6 నెలలైనా.. హామీల అమలేది?

తిమ్మాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి, 6 నెలలైనా హామీలను నెరవేర్చడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతం శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షుడు అరుణ్, దళిత మోర్చా అధ్యక్షుడు స్వామి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, నాయకులున్నారు.

నీట్‌ను రద్దు చేయాలి

హుజూరాబాద్: నీట్‌ను రద్దు చేసి, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. నాయకులున్నారు.